క్లుప్తంగా

రౌతులపూడి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పోతురాజు



రౌతులపూడి: రౌతులపూడి ఇన్‌చార్జ్ తహసీల్దారుగా ఎస్.పోతురాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం శంఖవరం తహసీల్దారుగా పనిచేస్తున్న ఆయనకు అదనంగా రౌతులపూడి తహసీల్దారుగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ తహశీల్దారుగా పనిచేసిన డీటీ పీవీవీసత్యన్నారాయనను కోటనందూరు బదిలీ అయ్యారు. మండలంలోని ప్రజలందరికీ రెవున్యూ, భూ సంభందిత సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

తుని రూరల్: వాతావరణంలో మార్పుల నేపథ్యంలో పశువులకు వివిధ రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఎస్.సూరవరం వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ కె.రాంమోహన్ సూచించారు. మండలంలోని ఎస్.సూరవరం, ఎస్‌ఎస్‌పీ నగరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పంట నమోదుతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ఏఓ పేర్కొన్నారు. ఖరీఫ్ పంటల యాజమాన్యం పద్ధతులపై అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ చింతంనీడి నాగసోమరాజు, ఉద్యాన అధికారి జి.విజయకుమారి, ఈఏఓలు వెంకటేష్, శ్రీను, శివాజీ రైతులు పాల్గొన్నారు.

కండక్టర్లపై సస్పెన్షన్ ఎత్తి వేయాలి

తుని: ఆర్టీసీ కండక్టర్లపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తుని ఆర్టీసీ గ్యారేజీ గేట్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఎంవీఆర్ మూర్తి, సాయిరాం, ఎంవీఎస్ నారాయణ మాట్లాడుతూ తుని డిపోలో కండక్టర్లుగా పని చేస్తోన్న సీహెచ్‌వీ ప్రసాద్, టి.లోవకుమారిలను అక్రమంగా సస్పెన్షన్ చేయడం సరికాదన్నారు. అక్రమ కేసులు రాసిన టీటీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం స్పందించి తక్షణమే సస్పెన్షన్ ఎత్తి వేసి వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. జేఏసీ నాయకులు కేఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బైక్ ర్యాలీ

ఏలేశ్వరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మండలవ్యాప్తంగా మంగళవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో రమణయ్యపేట గ్రామం నుంచి ఏలేశ్వరం మీదుగా తిరుమాలి, యర్రవరం, పెద్దనాపల్లి, సిరిపురం, పేరవరం, భద్రవరం, లింగంపర్తి గ్రామాల మీదుగా బైక్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయరాదని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఎస్సీవర్గీకరణ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుప్పాల నాగభూషణం, గునుపూడి కొండబాబు, పీతల సూకరాజు, కోనాల వెంకటరమణ, బత్తిన శ్రీను, వసంతయోహాన్ తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ప్రత్తిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు, 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన బర్ల ఆదివిష్ణు బైక్‌పై సారా తరలిస్తుండగా స్థానిక నరేంద్రగిరి సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి బైక్‌తో పాటు 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన గంగాధర్ బైక్‌పై సారా తరలిస్తుండగా మండలంలోని లంపకలోవ గ్రామ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి బైక్‌తో పాటు 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై రఘునాథరావు తెలిపారు. అతని నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రత్తిపాడులో బీజేపీ సంబరాలు

ప్రత్తిపాడు: హర్యానా ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు మంగళవారం రాత్రి ప్రత్తిపాడులో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ సెంటర్‌లో స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, మదినే గణేష్, సూరంపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట.. కానరాని కదలిక

- తునిలో తాండవ రిటైనింగ్ వాల్ ఊసెత్తని ప్రభుత్వం
- వర్షాకాలం వస్తే ప్రజల గుండెల్లో దడ
- గతంలో తాండవ నది పొంగి నీట మునిగిన పట్టణం
- 12 ఏళ్లుగా పట్టించుకోని పాలకులు



పట్టణంలోని ప్రధాన మార్కెట్ వద్ద ప్రవహిస్తున్న తాండవ నది

తుని: మెట్టకు జీవనాడిగా ఉన్న తాండవ వరద నీటి కాలువ పటిష్టత విషయంలో ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయి. ఉమ్మడి విశాఖజిల్లా నాతవరం సమీపంలో నిర్మించిన తాండవ రిజర్వాయర్ ద్వారా కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లోని వేలాది ఎకరాలకు సాగు, ప్రజలకు తాగు నీరు అందుతోంది. తాండవ జలాలతో మెట్టలో సైతం సమృద్ధిగా పంటలు పండుతున్నాయి.

వరదలొస్తే ముంపు

ప్రకృతి కన్నెర్ర చేస్తే ఏలా ఉంటుందో 1990, 2012లో తుని ప్రజలకు తెలిసింది. అప్పట్లో వరదల కారణంగా తుని పట్టణం ముంపునకు గురైంది. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులు అయ్యారు. రూ.కోట్లలో నష్టం కలిగింది. వరదల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రులు పర్యటించి వరద నీరు పట్టణంలోకి ప్రవేశించకుండా రిటైనింగ్ వాల్ (కరకట్ట) నిర్మిస్తామని హామీలు ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో కరకట్ట నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేశారు. తర్వాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, మాజీ ఎంపీ వంగా గీత తాండవ వరద నీటి నుంచి పట్టణాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా కేంద్ర బృందం పర్యటించి నివేదికను అంజేయాలని స్థానిక అధికారులకు సూచించారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కథ మొదటికి వచ్చింది. ఇటీవల కురిసిన వర్షాలకు తాండవనది ఉగ్రరూపం దాల్చింది. ప్రజలు భయం గుప్పట్లో గడిపారు.



తాండవ నదిని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ గీత, కేంద్ర బృందం (ఫైల్)



నీలం తుపాను సమయంలో మునిగిన రాజీవ్ గృహకల్ప ప్రాంతం (ఫైల్)

కరకట్టతో కాలుష్యానికి చెక్

తాండవ నదికి కరకట్ట నిర్మిస్తే ప్రజలకు రక్షణతో పాటు కాలుష్యానికి అడ్డుకట్ట పడుతుంది. కత్రాళ్ల కొండ నుంచి ఉప్పరగూడెం 2.5 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించాలన్నది ప్రభుత్వం ఉద్దేశ్యం. నది ఒడ్డు నుంచి ఐదు మీటర్లు ఎత్తు మేర కాంక్రీట్‌తో గోడ వస్తుంది. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి నదిలోకి వెళుతున్న మురుగు నీరు చెక్ పడుతుంది. రెల్లికాలనీ, రాజీవ్ గృహకల్ప, తారక రామానగర్, మేదరిపేట, మెయిన్ మార్కెట్, ఏటిఒడ్డువీధి, ఇసుకలపేట తదితర ప్రదేశాల్లో వ్యర్థాలను నదిలోకి డంపింగ్ చేస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే వరద నీటి నుంచి పట్టణానికి రక్షణ లభిస్తుంది. కరకట్ట పనులు పూర్తయితే చాలా వరకు సమస్యకు పరిష్కారం దొరుకుతోందని పర్యావరణ వేత్తలు అంటున్నారు.

ఎన్నికల హామీని అమలు చేయాలి

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు కరకట్ట నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. తుని గొల్ల అప్పారావు సెంటర్‌లో నిర్వహించిన సభలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, తుని టీడీపీ అభ్యర్థి యనమల దివ్య తాండవ నద ముంపు నుంచి రక్షణకు కరకట్ట నిర్మాణం చేపడతామని మాట ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.

– ఎం.చంద్రశేఖర్, వ్యాపారి, తుని

ఆక్రమణలు తొలగిస్తాం

కరకట్ట నిర్మాణానికి నిధులు మంజూరు కాగానే తాండవ నదిని ఆనుకుని ఉన్న ఆక్రమణలను తొలగిస్తాం. కత్రాళ్లకొండ నుంచి ఉప్పరగూడెం వరకూ సర్వే నిర్వహిస్తాం. దీంతో పాటు పట్టణం నుంచి నదిలోకి వస్తున్న వ్యర్థాలను కట్టడి చేయవచ్చు.

– అనురాధ, తాండవ, డీఈఈ

సమీకృత వ్యవసాయ విధానాలతో మేలు

- గ్రామాల్లో జోరుగా పొలం పిలుస్తోంది
- రైతులకు పలు అంశాలపై శిక్షణ

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: సమీకృత వ్యవసాయ విధానాలతో అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయాధికారి వై.గంగాధర్ అన్నారు. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఏకకాలంలో వ్యవసాయం, పాడి పరిశ్రమ, చేపల పెంపకం, కోళ్ల పెంపకం, ఉద్యాన పంటలు, ఆకుకూరలు, కాయకూరలు తదితర పంటలు ఎకరం పొలంలో సాగు చేయడం ద్వారా రైతు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకూ ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎస్.వరలక్ష్మి, వ్యవసాయ, పశువైద్యాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మెరుగైన ఫలితాలు

కోటనందూరు: వరిసాగులో ఎరువులు, పురుగు మందుల యాజమాన్యంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని అల్లిపూడిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ చంద్రశేఖర్ పొలాలను పరిశీలించి ఎరువులు, పురుగుమందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాండవ ఏఈ దుర్గబాబు, పట్టుపరిశ్రమశాఖ అధికారి మునలయ్య, ఏఈఓ కేవీ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.



అల్లిపూడిలో మాట్లాడుతున్న ఏఓ చంద్రశేఖర్

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

గండేపల్లి: మండలంలోని కె.గోపాలపురం, ఉప్పలపాడు గ్రామాల్లో ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులకు మంగళవారం తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి లావణ్య మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోందన్నారు. వ్యవసాయాధికారి సద్గురుమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్-2024 సీజన్‌కు గాను ఈ-పంట నమోదు ప్రక్రియ 95 శాతం పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ సుధ, పతంజలి ఆయిల్ పామ్ సిబ్బంది గణేష్, మణికుమార్, దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తుని: స్థానిక గణపతినగర్ పార్కులో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు సీహెచ్ సోమేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి వాకర్స్‌కు సుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. పట్టణంలోని వాకర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాణసంచా తయారీ క్రేంద్రంలో తనిఖీలు

జగ్గంపేట: గ్రామ శివారులో లైసెన్స్ కలిగిన బాణసంచా తయారీ కేంద్రాన్ని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు మంగళవారం పరిశీలించారు. తయారు చేసిన బాణసంచాను ఎక్కువ మొత్తంలో ఒకే ప్రదేశంలో నిల్వ చేయవద్దని తయారీదారులకు సూచించారు. నిబంధనలకు అనుగుణంగా ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాణసంచా తయారీ కేంద్రాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జగ్గంపేట పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు, మండల తహసీల్దార్ జేవీఆర్ రమేష్, అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు, జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు

దాతల సాయం మరువలేం

కిర్లంపూడి: దాతల సాయం చిరస్మరణీయం అని ప్రభుత్వ జూనియర్ కాలేజీ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్ఎస్ రామ్‌కుమార్ అన్నారు. కిర్లంపూడి ప్రభుత్వోన్నత పాఠశాల స్థల దాత కొక్కొండ రామశేషగిరిరావు వర్ధంతి సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. స్కూల్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీఎంసీ మాజీ చైర్మన్ దాడి గోవింద, పీడీ వీఎస్‌వీ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు 110 టెండర్లు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాల నిర్వాహణకు మంగళవారం సాయంత్రానికి 110 టెంటర్లు దాఖలైనట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి మండలంలో రెండు, ప్రత్తిపాడు మండలంలో మూడు, ఏలేశ్వరం నగర పంచాయతీలో మూడు, రూరల్ పరిధిలో మూడు, శంఖవరం మండలంలో నాలుగు వెరసి 15 మద్యం షాపులున్నాయి. ఈ మద్యం షాపులకు టెండర్ల ప్రక్రియ ఈ నెల 9వ తేదీ సాయంత్రంతో ముగుస్తుందని చెప్పారు.

కోడి వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలు సీజ్

శంఖవరం: విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు చేపల చెరువులకు కోడి వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను అన్నవరం పోలీసులు పట్టుకున్నారు. అన్నవరం ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు అన్నవరంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా దుర్వాసన రావడంతో వాహనాలను పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాలను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కోడి వ్యర్థాలను నిర్మానుష్య ప్రదేశంలో పాతిపెట్టినట్లు తెలిపారు.

150 మందికి కంటి పరీక్షలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచిలో ఏలేశ్వరం జీసస్ మినిస్ట్రీ విజయ ఫౌండేషన్, పిఠాపురం క్రిస్టియన్ మెడికల్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శక్కిరెడ్డి విజయబాబు సారధ్యంలో వైద్య బృందం 150 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లను అందజేశారు.

జాతీయస్థాయి యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న నరసింహారావు

తుని: జాతీయ స్థాయి యోగా పోటీల్లో స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ చూపారని ఆ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ మంగళవారం తెలిపారు. ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకూ గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో జీఎస్ఎస్ చరణ్, పి.సోహన్‌శ్రీ, పి.దేవాన్ష్‌నాయుడు, సీహెచ్ జయదీప్, వి.చైతన్యలతో కూడిన బృందం ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించిందన్నారు. కాగా మంగళవారం విద్యాసంస్థల్లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులు, యోగా గురువులు డి.సురేష్, జయంతిలను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

కేజీబీవీలో పోస్టుల భర్తీకి చర్యలు

తుని రూరల్: మండలంలో వి.కొత్తూరులోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో రెండు నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదలైందని, మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తులు ఇస్తున్నట్టు ఎంఈఓ పరవాడ గీతాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెడ్ కుక్, స్కావెంజర్ పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. 18 సంవత్సరాలు నిండి, 42 సంవత్సరాల లోపు వయస్సు గల మహిళలు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఎంఆర్‌సీ కార్యాలయంలో ఈ నెల 15వ తేదీ లోగా అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలలోపు సంప్రదించాలని సూచించారు.

వార్డు సభ్యులకు ముగిసిన శిక్షణ

ఏలేశ్వరం: మండల పరిధిలోని ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన శిక్షణ ముగింపు సమావేశంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధికి ఉపసర్పంచులు, వార్డు సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని గ్రామ పంచాయతీ ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఎంపీడీఓ జి.శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు. గ్రామ పరిపాలన, పంచాయతీ రాజ్ చట్టం, పంచాయతీ ఆస్తులు, కోర్టు కేసుల్లో న్యాయపరమైన అంశాలపై సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పలు గ్రామాల వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని 14 పంచాయతీల్లో వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు రెండురోజులు పాటు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ మాట్లాడుతూ పరిశుభ్రత, వీధిలైట్లు, తాగునీరు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమలు, ఈగలు ప్రబల్లకుండా బ్లీచింగ్ చల్లాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల సంబరం



ధనమ్మతల్లికి బోనాలు తీసుకు వెళుతున్న భవానీ భక్తులు, మహిళలు

జగ్గంపేట: గ్రామ శివారులో వెలిసిన ధనమ్మతల్లికి మంగళవారం మహిళలు బోనాలు సమర్పించారు. స్థానిక శెట్టిబలిజీపేట కనకదుర్గ అమ్మవారి మండపం నుంచి భవానీ భక్తులు, మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. బోనాలతో పొలాల మధ్యలో ఉన్న ధనమ్మతల్లి గుడికి అమ్మవారికి బోనాలు సమర్పించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

కాగితాలమ్మకు బోనాల సమర్పణ

తొండంగి: బెండపూడి పంచాయతీ పరిధిలోని తమ్మయ్యపేట గ్రామదేవత కాగితాలమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు మంగళవారం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గరగ నృత్యాలు, తప్పెట గుళ్ల వంటి సంప్రదాయ నృత్యాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మద్దుకూరి వీరవెంకటసత్యనారాయణచౌదరి, ఆరుమిల్లి ఏసుబాబు చౌదరి, మాజీ వైస్ సర్పంచ్ సాధనాల వీరబాబు, ఎంపీటీసీలు మళ్ల సురేష్, గొంతెన నాగేశ్వరరావు, సోమిశెట్టి చలపతి, బూసాల గణపతి తదితరులు పాల్గొన్నారు.

పెదశంకర్లపూడిలో భవానీల సందడి

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో మంగళవారం భవానీ మాలదారులు సందడి చేశారు. దేవీ నవరాత్రుల్లో భాగంగా అమ్మవారి చిత్రపటంతో గ్రామం ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేరళ డప్పు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. మహిళలు, భవానీ భక్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సిరుల తల్లి.. కల్పవల్లి

- మహాలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన జగన్మాత
- ఆలయాల్లో విశేష పూజలు

తునిరూరల్/శంఖవరం/కిర్లంపూడి/కోటనందూరు/ఏలేశ్వరం/జగ్గంపేట/తొండంగి: శరన్నవరాత్ర ఉత్సవాలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారని ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన మహిళలు కోలాటం నిర్వహించారు. బుధవారం అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ చేయనున్నట్టు వేదపండితులు తెలిపారు.

మహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ

దసరా ఉత్సవాల్లో భాగంగా కోటనందూరు మండలం కాకరాపల్లిలో వేంచేసిన కనకదుర్గమ్మ మంగళవారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు అమ్మవారిని డబ్బులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా భక్తులు అమ్మవారిని దర్శించి తీర్ధ ప్రసాదాలు తీసుకున్నారు.

గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన వనదుర్గ అమ్మవారు


శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా రత్నగిరిపై వనదుర్గ అమ్మవారు మంగళవారం గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గోపాలపట్నంలో...

తొండంగి మండలం గోపాలపట్నంలోని నేరేళ్లమ్మ అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని ఏవీ నగరం, ఎ.కొత్తపల్లి, వేమవరం, కొమ్మనాపల్లి, రావికంపాడు మహిషాశురమర్ధిని ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంఖవరం మండలం సీతంపేటలో వేంచేసిన దుర్గామీనాక్షి అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు చేశారు.

లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

ఏలేశ్వరం తోటవీధిలో వేంచేసిన దుర్గాదేవి అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగ్గంపేట దేవిసెంటర్‌లో వేంచేసిన భువనేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కిర్లంపూడి మండలం జగపతినగరంలో వేంచేసిన అభయ దుర్గమ్మ, కిర్లంపూడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి, వనదుర్గమ్మ, రామచంద్రపురం కనకదుర్గ అమ్మవార్లు మంగళవారం మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



లోవలో మహాలక్ష్మీదేవి అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు



గాయత్రీ దేవి అలంకరణలో రత్నగిరిపై వనదుర్గ అమ్మవారు



కాకరాపల్లిలో మహాలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ



మహాలక్ష్మీదేవి అవతారంలో సీతంపేట దుర్గా మీనాక్షి అమ్మవారు



జగ్గంపేటలో మహాలక్ష్మి అమ్మవారిగా దర్శన మిచ్చిన భువనేశ్వరీదేవి

పోలీసుల ప్రత్యేక గస్తీ



జగ్గంపేటలో ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

జగ్గంపేట: దసరా సందర్భంగా ఐదు వాహనాల్లో రాత్రి వేళ ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. దసరా సెలవులకు ఊర్లు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసుశాఖ ఉచితంగా అందిస్తున్న లాక్ట్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్‌ను (ఎల్‌హెచ్‌ఎంఎస్) సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సౌకర్యం పొందాలనుకునే వారు కాకినాడ పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్లు 94949 33233, 94907 63489 నంబర్లకు కాల్ చేయాలని చెప్పారు. వీధుల్లో రాత్రి సమయాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే జగ్గంపేట పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యేక సూచనలు

మండలంలోని ఆటో యూనియన్ నాయకులతో మంగళవారం జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆటో డ్రైవర్లు నియమ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని సీఐ సూచించారు.